క్లుప్తంగా

ఎయిర్ పోర్టు కారిడార్‌లో బ్యూటిఫికేషన్ పెంచండి

మునిసిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి



పటమట(విజయవాడతూర్పు): రామవరప్పాడు రింగ్ నుంచి గన్నవరం వరకు జరుగుతున్న ఎయిర్ పోర్ట్ కారిడార్ పనులు మరింత ఆకర్షణీయంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అధికారులను రాష్ట్ర మునిసిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి ఆదేశించారు. నూతనంగా నిర్మించిన గ్రిల్స్ బ్యూటిఫికేషన్‌ను ఆమె మంగళవారం పరిశీలించారు. స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి శ్రీలక్ష్మి క్షేత్రస్థాయిలో కారిడార్ పనులను పరిశీలించారు. కారిడార్ వెంట ఉన్న ఎలక్ట్రికల్ పోల్స్‌పై ఆకర్షణీయ రంగులతో పెయింటింగ్ వేయాలని సూచించారు. ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్, డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ సిరన్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.ఎస్.ఎన్. ప్రసాద్ పాల్గొన్నారు

హోంగార్డు కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఇటీవల పదవీ విరమణ పొందిన హోంగార్డు కుటుంబానికి ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా రూ.5 లక్షల ఆర్థిక సాయం చెక్కును మంగళవారం తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. నగరంలో పనిచేస్తున్న హోంగార్డులు మరణించినా లేదా పదవీ విరమణ చేసిన తరువాత ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు నగరంలో పనిచేస్తున్న హోంగార్డులు స్వచ్ఛందంగా తమ వేతనం నుంచి వారికి ఆర్థిక సాయం అందజేయడం అభినందనీయమన్నారు. నగరంలో మహిళా హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తూ గత నెల 13న పదవీ విరమణ పొందిన గాలి ప్రభాకరమ్మకు నగదును సీపీ అందజేశారు. అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు, హోంగార్డు ఆర్ఐ.కృష్ణ, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన అవసరం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రపంచ మధుమేహం దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం విజయవాడ డివిజనల్ రైల్వే హాస్పిటల్‌లోని న్యూ ఓపీడీ భవనంలో మధుమేహంపై అవగాహన, స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రైల్వే హాస్పిటల్ సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల పాల్గొని ఆరోగ్యంపై మధుమేహం ప్రభావం గురించి రోగులు, ఉద్యోగులకు అవగాహన కల్పించారు. 35–45 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు తరచూ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటే సుగర్ ముందస్తుగా గుర్తించడంలో సహాయపడుతుందన్నారు. ఏసీఎంఎస్ డాక్టర్ ఎం.జయదీప్, సన్‌రైజ్ హాస్పిటల్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఎం.వి సాయికృష్ణ, డాక్టర్ సింధూ, ఉద్యోగులు పాల్గొన్నారు.

ధ్యాన మందిర నిర్మాణానికి రూ.లక్ష విరాళం



గుణదల(విజయవాడతూర్పు): ప్రజా ప్రయోజనార్థం వినియోగపడే కార్యక్రమాలకు దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ఎంతగానో ఉపకరిస్తుందని 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీరామచంద్రనగర్‌లో నిర్మితమవుతున్న శ్రీరామ ధ్యాన మందిర నిర్మాణానికి లక్ష రూపాయల విరాళాన్ని మంగళవారం అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నగరంలో అనేక సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే తూర్పు నియోజకవర్గం పరిధిలోని అనేక మంది పేదలకు జీవనోపాధి నిమిత్తం ఇస్త్రీ పెట్టెలు, టిఫిన్ బండ్లు, తోపుడు బండ్లను అందజేస్తున్నారని చెప్పారు. ఈ సేవా కార్యక్రమాల్లో భాగంగా 3వ డివిజన్ పరిధిలో నిర్మాణమవుతున్న శ్రీరామ ధ్యాన మందిరానికి దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా లక్ష రూపాయలు విరాళం ఇచ్చామన్నారు. వీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు ముసునూరి సుబ్బారావు, కాలనీ ప్రెసిడెంట్ సీతారామయ్య, కోటేశ్వరరావు, రమణ, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష

- ప్రజల ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యం
- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



49వ డివిజన్‌లో మెడికల్ కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

విద్యాధరపురం... వించిపేట(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని ప్రజలందరి ఆరోగ్యానికి రక్షగా నిలిచేది 'జగనన్న ఆరోగ్య సురక్ష' అని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 49వ డివిజన్, 167వ సచివాలయ పరిధిలోని ఫోర్‌మెన్‌బంగ్లా, వెలంపల్లి ఫౌండేషన్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజల ఆరోగ్య భద్రతకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలనే ఉద్దేశంతోనే అన్ని శాఖల సమన్వయంతో ఆరోగ్య సురక్ష శిబిరాలను రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యశిబిరంలో అన్ని విభాగాల వైద్య నిపుణులచే రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. అవసరమైన రోగులు ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులతో మెరుగైన వైద్యసేవలు పొందుతున్నారని చెప్పారు. పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం రోగులకు అందుతున్న వైద్య సేవలను పర్యవేక్షించి, వారికి జగనన్న ఆరోగ్య సురక్ష కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్, నాయకులు గౌడుపేరు సుధీర్, చేపూరి శ్రీనివాసరావు, దాసి జయప్రకాష్ కెనడి, సచివాలయ ఉద్యోగులు, గృహ సారథులు, వలంటీర్లు, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలి

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): 35వ డివిజన్ పరిధిలోని బాప్టిస్ట్‌నగర్ సచివాలయం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాన్ని ఆయన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ బలసానీ మణిమ్మతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన రోగులతో వారు మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ.. వైద్యశిబిరంలో రోగులకు ఏడు రకాల వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేస్తున్నామన్నారు. దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు కూడా ఇక్కడ మెరుగైన వైద్యం అందిస్తున్నారని చెప్పారు. ఇంటి వద్దకే వైద్య సేవలను తీసుకువచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో సాక్ష్యాలతో సహా అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు కోసం టీడీపీ నాయకులు యాత్రలు చేసినా, పూజలు, యాగాలు చేసిన ప్రయోజనం ఉండదన్నారు. చంద్రబాబు అరెస్ట్ పట్ల ప్రజల్లో స్పందన లేదన్నారు. స్వలాభం కోసం దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ దేనికైనా సిద్ధమనే రీతిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. పవన్ పార్టీ పెట్టిందే చంద్రబాబు కోసమని, పురందేశ్వరి టీడీపీ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.



బాప్టిస్ట్‌నగర్‌లో..

రైల్వే ఉద్యోగులకు జీఎం 'మ్యాన్ ఆఫ్ ద మంత్' సేఫ్టీ అవార్డులు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విధి నిర్వహణలో అప్రమత్తంగా, సకాలంలో చురుగ్గా స్పందించి ప్రమాదాల నివారణకు కృషి చేసిన విజయవాడ డివిజన్‌కు చెందిన నలుగురు ఉద్యోగులకు జీఎం 'మ్యాన్ ఆఫ్ ద మంత్' సేఫ్టీ అవార్డులను దక్షిణ మధ్య రైల్వే జీఎం ప్రకటించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జీఎం అరుణ్‌కుమార్ జైన్ సోమవారం విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డీఆర్‌ఎమ్‌లతో జరిగిన వర్చువల్ సమావేశంలో ఆయన అవార్డులను ప్రకటించారు. ఈ మేరకు విజయవాడ డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ మంగళవారం తన కార్యాలయంలో ఆయా ఉద్యోగులకు ఈ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ విజయవాడ డివిజన్‌లో పనిచేస్తున్న ట్రాక్ మెయిటెనర్ ఆర్.అశ్రునాయుడు, గూడ్స్ లోకో పైలట్ కె.సతీష్‌బాబు, మెకానికల్ విభాగంలో పనిచేస్తున్న పి.అవినాష్, రాజమండ్రి సీ అండ్ డబ్ల్యూ బ్రాంచ్‌లో పని చేస్తున్న ఎస్.వీరారెడ్డిలను ప్రత్యేకంగా అభినందించారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

కలెక్టర్ ఢిల్లీరావు



అయ్యంకి, నెహ్రూ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు



పుస్తకాలను తిలకిస్తున్న విద్యార్థినులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. కేబీఎన్ కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను కలెక్టర్ మంగళవారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులకు జాతీయ గ్రంథాలయ వారోత్సవ, బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. సమాజంలో గ్రంథాలయాలు, గ్రంథపాలకుల ఔన్నత్యాన్ని చాటిచెప్పేందుకు పుస్తక పఠనం అలవాటుతో పొందే ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా గ్రంథాలయ వారోత్సవాలను జరుపుతున్నట్లు చెప్పారు. ప్రస్తుత ఆధునిక సాంకేతిక ప్రపంచంలో ఈ–బుక్స్, ఆడియో బుక్స్ వంటివి అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు కళాశాల గ్రంథాలయాన్ని పరిశీలించారు. గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు, కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాస్, గ్రంథాలయ అధికారి వై.శ్రీనివాసరాజు, ఇంటర్మీడియెట్ విభాగం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టి.భాగ్యకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజల జీవన వికాసానికి, సామాజిక పురోగతికి గ్రంథాలయాలు సోపానాలుగా నిలుస్తున్నాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. గ్రంథాలయ విశిష్టతను నేటి తరానికి చాటి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాల వారోత్సవాలను కలెక్టర్ ఢిల్లీరావు మంగళవారం ప్రారంభించారు. తొలుత జవహర్‌లాల్ నెహ్రూ, రవీంద్రనాథ్ ఠాగూర్, గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. దేశ గ్రంథాలయ ఉద్యమ పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ సేవలకు గుర్తుగా ఆయన జన్మదినం రోజున జాతీయ గ్రంథా లయ దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినప్పటికీ గ్రంథాలయాల ద్వారా అందే సమాచారానికి మించినది లేదన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమల పూర్ణమ్మ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల్లో మంగళవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయన్నారు. సాహితీ వ్యక్త జి.వి. పూర్ణచందు, స్థానిక కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి, గ్రంథాలయ కార్యదర్శి నగేష్, గ్రంథపాలకులు కె.రమాదేవి, జి.ఉమారాణి, వై.ధనలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శనలతో విజ్ఞానం

పటమట(విజయవాడతూర్పు): పుస్తక ప్రదర్శనల ద్వారా విద్యార్థులు అనంతమైన విజ్ఞానాన్ని పొందవచ్చని మేరీస్ స్టెల్లా కళాశాల ఇంటర్మీడియెట్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ అన్నారు. మంగళవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం పటమట కేఎస్ఆర్ బాలికల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల్లో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు.శాస్త్ర సాంకేతిక రంగాల్లో, దేశ రాజకీయ, ఆర్థిక రంగాల్లో జరగుతున్న మార్పులను విద్యార్థులు పుస్తకాల పఠించడం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. విద్యార్థులు పుస్తకాలు చదివితే ప్రపంచం తెలుస్తుందని, ఎందరో పండితులు, కవులు, భిన్న రచయితలు, దేశ చరిత్ర, ప్రపంచ దేశాల మైత్రి తదితరాలన్నీ పుస్తకాల ద్వారా మాత్రమే తెలుస్తాయని చెప్పారు. ఇంటర్మీడియెట్ కళాశాల ఆర్ట్స్ కో–ఆర్డినేటర్ స్వప్న, లైబ్రరీ విభాగాధిపతి విశాలాక్షి, లైబ్రేరియన్ హేమలత, పాఠశాల స్కూల్ ఇన్‌చార్జి మురళీకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు ప్రత్యేకం.. పింక్ టాయిలెట్స్



అధికారులకు సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని బెంజి సర్కిల్ వద్ద రూ.20 లక్షలతో మహిళలకు ప్రత్యేకంగా నిర్మించిన పింక్ టాయిలెట్ త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన అధికారులు, సిబ్బందితో కలిసి పింక్ టాయిలెట్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా టాయిలెట్స్‌లో ఏర్పాటు చేసిన తల్లులు బిడ్డలకు పాలిచ్చేందుకు ప్రత్యేక గదిని, శానిటరీ న్యాప్కిన్స్ కోసం వెండింగ్ మిషన్‌ను, మహిళా ప్రయాణికులు రిఫ్రెష్ అయ్యేందుకు కల్పించే ప్రత్యేక సదుపాయాలు, బాత్ రూమ్స్ పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాలను సుందరీకరణ చేయాలని ఆదేశించారు.

గార్బేజ్ ఫ్రీ సిటీ లక్ష్యం..

అనంతరం ఆయన మాట్లాడుతూ పింక్ టాయిలెట్స్‌లో స్త్రీలకు అవసరమయ్యే అన్ని రకాల వసతులు, ఫీడింగ్ రూమ్, శానిటరీ న్యాప్కిన్స్ వంటి సదుపాయాలు ఉన్నాయన్నారు. రద్దీ ఎక్కువగా ఉండే బెంజ్ సర్కిల్ వద్ద స్త్రీలకు ఉపయోగపడే విధంగా నిర్మించామని, రోడ్లు, ప్రజానివాస ప్రాంతాలు, వాణిజ్య ప్రాంతాలు, జనసమూహ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం వలన విజయవాడ నగరపాలక సంస్థ స్వచ్ఛ సర్వేక్షన్ 2023లో గార్బేజ్ ఫ్రీ సిటీగా సెవెన్ స్టార్ సాధిస్తుందని చెప్పారు. మహిళలు శానిటరీ న్యాప్కిన్లు, డైపర్లు, దూది సిరంజులు, కాలం చెల్లిన మందులను నగరపాలక సంస్థ శానిటేషన్ సిబ్బందికి విడిగా అందజేయాలని సూచించారు. కార్యక్రమలో అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏఎస్ఎన్ ప్రసాద్, డెప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ సిరెన్ రాయ్, ఉద్యానవన విభాగం అధికారి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.



చాచా నెహ్రూ స్ఫూర్తితో..

దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి.. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓ బాలుడు తన ఔదార్యాన్ని చాటాడు. రైల్వే స్టేషన్ వద్ద ఉన్న నిరాశ్రయులకు తన వంతుగా మంగళవారం ఆహారం, పండ్లు అందజేశాడు. ఈ చిత్రాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఘనంగా బాలల దినోత్సవం



విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న డాక్టర్ వర్షా పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రైల్వే ఆడిటోరియంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వర్షా పాటిల్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా జాక్ అండ్ జిల్ విద్యార్థులతో కలిసి భారత దేశ మొట్టమొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో బాల్యం ఎంతో అందమైనదని, ఆ జ్ఞాపకాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పలు ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గత సెప్టెంబర్ 24న సికింద్రాబాద్‌లో జరిగిన ఆల్ ఇండియా ఆన్ ద స్పాట్ డ్రాయింగ్ పోటీల్లో మొదటి బహుమతి సాధించిన అనన్యకు ప్రశంసా పత్రం, నగదు బహుమతిని డాక్టర్ వర్షా అందించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సెక్రటరీ ప్రియాంక, రమ్యా, దివ్యశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దేశ భవితకు బాటలు వేసిన నెహ్రూ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారతదేశ తొలి ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు జవహర్ లాల్ నెహ్రూ దేశ భవితకు బాటలు వేశారని నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు అన్నారు. నెహ్రూ జయంతి సందర్భంగా మంగళవారం కొత్తపేట నెహ్రూ చౌక్ సెంటర్‌లో నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

త్రిశక్తి పీఠంలో 14 నుంచి మాస దీక్ష అభిషేకం

కృష్ణలంక(విజయవాడతూర్పు): కార్తిక మాసం సందర్భంగా బస్టాండ్ సమీపంలోని కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో నెల రోజుల పాటు 365 లింగాలతో మాస దీక్షగా అభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 7 నుంచి 9.30 గంటల వరకు అభిషేకం జరుగుతుందన్నారు. అభిషేకం చేయించుకోవాలనుకునే భక్తులు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఆది దంపతులకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు పలువురు చిన్నారులు నృత్య నీరాజనాలను అందించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై విజయవాడకు చెందిన ఎం.రాధా నృత్య బృందానికి చెందిన ఎం.మౌనిక, బి.హర్షవర్ధిని, మహి, బాల, కుసుమ, లిఖితలు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అమితంగా ఆకట్టుకుంది. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించారు.

చిత్రలేఖనంతో సృజనాత్మకతకు పదును



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో అతిథులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): చిత్రలేఖనం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా) కళాశాల డైరెక్టర్ డాక్టర్ సిరికొండ రమేష్ తెలిపారు. డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ, ఆనంత్ డైమండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో రమేష్ ఆస్పత్రి రోడ్డులోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాల ఆవరణలో బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు మంగళవారం జరిగాయి. విద్యార్థులను ఉద్దేశించి రమేష్ మాట్లాడుతూ చిత్రలేఖనం ద్వారా విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటుగా వారిలో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఎం.శేషగిరిరావు మాట్లాడుతూ చిన్నారులకు బాలల దినోత్సవం సందర్భంగా డ్రాయింగ్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంత్ డైమండ్స్ వ్యవస్థాపకుడు జాస్తి అనంత పద్మశేఖర్, డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ సొసైటీ అకాడమీ అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ చిన్నారులకు చిత్రలేఖనంపై ఆసక్తిని పెంపొందించడానికి ప్రతి ఏడాది బాలల దినోత్సవం రోజున చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ రోజు నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఈ నెల 19వ తేదీన స్పా కళాశాల ఆవరణలో బహుమతులను అందజేస్తామన్నారు. పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో టీడీపీ నాయకుడి అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పేదలకు జేఎన్ఎన్‌యుఆర్‌ఎం ఇల్లు ఇప్పిస్తామని చెప్పి నమ్మించి మోసం చేయడం, వారి నుంచి భారీగా డబ్బులు వసూలు కేసులో కొత్తపేట పోలీసులు మంగళవారం టీడీపీ నాయకుడిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పలువురి నుంచి కొంత మంది టీడీపీ నాయకులు ఇల్లు ఇప్పిస్తామని రెండున్నర కోట్ల రూపాయలు వసూలు చేశారు. అయితే డబ్బులు తీసుకున్న తర్వాత ఇల్లు మంజూరు చేసినట్లు నకిలీ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ప్లాట్ల కేటాయింపు జరగకపోవడంతో బాధితులు తాము మోసపోయినట్లు గ్రహించి గత నెల 7వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేయడంతో పాటు అప్పట్లో ముగ్గురు ప్రధాన నిందితులను అరెస్టు చేశారు. తాజాగా అదే కేసులో మరో నిందితుడైన కొట్టేటి హనుమంతరావు(58)ని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితుడిని 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు సీఐ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

శివాలయం సెంటర్ పేరు మార్పు అవాస్తవం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం శివాలయం సెంటర్‌ను వైఎస్సార్ సెంటర్‌గా పేరు మార్చారంటూ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని 42వ డివిజన్ కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి ధ్వజమెత్తారు. ఇందులో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. భవానీపురంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. శివాలయం సెంటర్‌లో ఇటీవల మహానేత వైఎస్సార్ కాంస్య విగ్రహం ఆవిష్కరించామన్నారు. ఆ విగ్రహాన్ని చూసి జనసేన పార్టీ, ఆ పార్టీ నాయకుడు పోతిన మహేష్‌కు వణుకు మొదలైందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో దేవాలయాలు కూలుస్తుంటే అప్పుడు మహేష్ ఏం చేశాడని ప్రశ్నించారు. టీడీపీ దేవాలయాలను కూల్చివేస్తే తమ పార్టీ అధికారంలోకి రాగానే వాటిని పునర్ నిర్మిస్తున్నామన్నారు. తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

రెడ్డిగూడెం: మండలంలోని రాఘవాపురంలోని బీసీ కాలనీలో సోమవారం రాత్రి ఇరువర్గాలు కర్రలు, రాళ్లతో దాడి చేసుకుంటున్న సమయంలో వారిని వారించే క్రమంలో కానిస్టేబుల్ సీహెచ్ శివన్నారాయణ గాయపడ్డాడు. కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు. మైలవరం సీఐ మోహన్‌రెడ్డి దర్యాప్తు చేసి 27 మందిని అరెస్టు చేసి మంగళవారం రాత్రి మైలవరం జడ్జి ముందు హాజరు పర్చినట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనలో 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీను పేర్కొన్నారు.